




సర్కారు ఆర్థిక అరాచకత్వం

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగుల పిఎఫ్ నగదు, ఎపిజిఎల్ఐ నిధులు ఇష్టానుసారంగా వాడుకుంటూ ఆర్థిక అరాచకత్వానికి పాల్పడు తుందని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లరెడ్డి విమర్శించారు. ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన 36 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 169 మండలాలు న్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో ప్రచారం దాదాపుగా పూర్తయిందన్నారు. అన్ని ప్రాంతాల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, నిరుద్యోగులు వివిధ వర్గాల ఉద్యోగులను కలిసినట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారం చేపట్టే ముందు, పాదయాత్రలు నిర్వహించే సమయంలో చేసిన హామీలకు భిన్నంగా పాలన సాగుతుం దన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని హామీ చేశారని, దాన్ని గాలి కొదిలేశారన్నారు. రాష్ట్రంలో 6500 కానిస్టేబుల్స్ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా 16 వేల కానిస్టేబుల్స్ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 5 లక్షల మంది నిరుద్యోగులు పోటీ పడ్డారన్నారు. దీన్ని బట్టి చూస్తే నిరుద్యోగం ఏ స్థాయిలో తాండవిస్తుందో అర్థమౌతుం దన్నారు. రాష్ట్రంలో అన్ని విభాగాల్లో 1.70 లక్షల పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం సచివాలయ పోస్టులు భర్తీ తప్ప మిగిలిన విభాగాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. సచివాలయ పోస్టులు భర్తీ చేసినప్పటికీ ఆ ఉద్యోగుల్లో అనేక అసంబద్ధాలున్నాయన్నారు. వారిలో కొంత మందికి రెండు సంవత్సరాల తొమ్మిది నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ వారిలో సగం మందిని రెగ్యులర్ చేయకుండా రూ.15 వేలు వేతనంగా అందజేస్తూ కాలయాపన చేస్తుందన్నారు. సిఆర్‌పిలు ప్రతి మండలంలో 16 మంది వరకు విధులు నిర్వహి స్తున్నార న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులకు,ఉపాధ్యాయలకు ఒకటవ తేదిన జీతాలు , పెన్షనర్లకు పెన్షన్ అందజేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కాంట్రాక్టు టీచర్లు, ఔట్‌సోర్సింగ్ లెక్చరర్లు, అవుట్ ఉపాధ్యాయులు పెద్దఎత్తున విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఎంఎస్‌సి, ఎంఈడి చేసిన ఎంతో మంది ప్రభుత్వం రూ.12 వేలు వేతనంగా అందజేయడం దుర్మార్గమన్నారు. యుటిఎఫ్ ఉపాధ్యా సంఘంలో 38 ఏళ్ళ పనిచేసిన అనుభవం ఉందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల.పెన్షనర్ల సమస్యల పట్ల తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. సిపిఎస్ ఉద్యమం చేస్తే ఉద్యోగులను జైళ్లలో పెట్టిందన్నారు. హౌస్ అరెస్టులకు పాల్పడిం దన్నారు. పాద యాత్రలు చేసే సమయంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చేసిన హామీలను అమలు చేయాల్సిందేనన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల కమిటీ కన్వీనర్ ఎం. మోహన్‌రావు, సిపిఎం నాయకులు జి. నాగేశ్వరరావు,వి.ఆర్.ఎల సంఘం నాయకులు కె.పెంచలనరసయ్య,యుటిఎఫ్ సీనియర్ నాయకులు మాదాల వెంకటకృష్ణ , యుటిఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు గోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి. ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్యాంకు అవినీతిలో రాజకీయ పెత్తనం..!

ఇందుకూరుపేట మండలం, కొత్తూరు మహిళా సహకార బ్యాంక్‌లో జరిగిన అవినీతిలో రాజకీయ జోక్యం కనిపిస్తోంది. పేద మహిళలు దాచుకున్న డబ్బులను దోచుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు విచారణ వేగవంతం చేశారు. ఇప్పటి వరకు సుమారు రూ.3.50 కోట్లు అవినీతి బయట పడింది. ప్రస్తుత పాలకవర్గం, ఉద్యోగులతోపాటు, పాత పాలకవర్గం పాత్ర ఉన్నట్లు గుర్తించారు. వైసిపి, టిడిపి నేతలు భార్యలు ఉండడంతో వారిని బయట పడేయడానికి ఇరుపార్టీల నేతలు జోక్యం చేసుకుంటున్నట్లు సమా చారం. ఈ ఆర్థిక నేరం నుంచి తమ సతీమణులను తప్పించడానికి అన్ని ప్రయాత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో పాతది రూ.1.50 కోట్లు, కొత్తగా రూ.2 కోట్లు అవినీతి జరిగినట్లు సమా చారం. అధికారులు నిస్పక్షపాతంగా విచారణ జరిగిన అవినీతి సొమ్ము రికవరీ చేస్తారా.? రాజకీయ నేతల వత్తిళ్లకు తలొగ్గుతారా ? అనే ఈ ప్రాంతంలో చర్చినీయాంశమైంది..

- టిడిపి, వైసిపి నేతల జోక్యం
- భార్యలను కాపాడుకుంటున్న వైనం..
- రూ.3.50 కోట్లు గోల్‌మాల్
- చిత్తుకాగితాల్లో చెత్త లెక్కలు .



బ్యాంక్‌లో విచారణ సమయంలో సిబ్బంది, సభ్యుల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజల సొమ్ముకు ఏలాంటి భయమూ లేకుండా పంచుకుతింటున్నారు. అధికారుల అజమాయిషీ లేకపోవడం, చట్టాలు, శిక్షలంటే భయం లేక పోవడంతో ఇలా భరితెగిస్తున్నారు. ఇటీవల జిల్లా పౌరసరఫరా శాఖలో ఏకంగా రూ.100 కోట్ల వరకు అవినీతికి పాల్పడిన విషయం తెలిసిందే. ఇందులో జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, పాత్ర ఉండడంతో జైలుకు వెళ్లారు. అధికారులు విచారణ జరిపి రూ.30 కోట్ల వరకు రికవరీ చేశారు. జైలుకు వెళ్లి వచ్చిన అధికారులు ఏమీ పట్టనట్లు ఉంటున్నారు. ఇప్పుడు అంత కాకపోయినా అదే తరహాలో జిల్లా సహకారం సంఘం ఆధ్వరంలో ఇందుకూరుపేట మండలం, కొత్తూరు గ్రామంలో పొదుపు లక్ష్మీ పరస్పర సహకార మహిళా బ్యాంక్‌లో అవినీతి జరిగింది. ఇక్కడ పేద మహిళలు పొదుపు చేసుకున్న డబ్బులను గుట్టుచప్పుడు కాకుండా మింగేశారు. 1998లో 500 గ్రూపులతో ఈ బ్యాంక్ నిర్మాణం జరిగింది. ప్రతి గ్రూపులో పది మంది చొప్పున ఐదు వేల మంది సభ్యులుండేవారు. కాలక్రమంలో సభ్యులు సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం 150 గ్రూపుల్లో 1500 సభ్యులతో బ్యాంక్ నడుస్తోంది. ఐదు కోట్ల రూపాయల వ్యాపార, లావాదేవీలతో ఉంది. బ్యాంక్ సక్రమంగా నిర్వహించేందుకు 11 మంది డైరెక్టర్లు ఎన్నికయ్యారు. ఇందుకూరుపేట మహిళా బ్యాంక్‌లో జరిగిన అవినీతి, అక్రమాలు ఈ రోజువి కాదు. ఇందులో ఇక్కడ పనిచేసే మేనేజర్ ఎస్‌కె. హసీనా నాలుగు నకిలీ గ్రూపులు సృష్టించి రూ.25 లక్షలు, క్యాషియర్ ఎస్‌డి రమేజా ఆరు గ్రూపులు సృష్టించి రూ.18 లక్షలు, డైరెక్టర్ అన్నపూర్ణమ్మ 11 గ్రూపులు సృష్టించి భారీగా నగదు దిగమింగినట్లు తెలుస్తోంది. ఇందులో నకిలీ గ్రూపు సృష్టించి కొంత, మహిళలు బ్యాంక్‌లకు చెల్లించిన నగదు చెల్లించకుండా ఇంకొంత అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. సహకారశాఖ అధికారులు వేగవంతంగా విచారణ చేపట్టారు. తవ్వేకొద్ది అవినీతి అక్రమాలు బయట పడుతున్నాయి. రికార్డులు లేకుండా కేవలం చిత్తుకాగితాలపై కాకిలెక్కలు తయారుచేశారు. విచారణ అధికారులకు రికార్డులు దొరకడం లేదు. ఏ పద్దు ఎప్పుడు, ఎక్కడుందో తెలుసుకోడానికి నానా ఇబ్బందులు పడు తున్నారు.

రూ.3.50 కోట్లు గోల్‌మాల్..!

ఇందుకూరుపేట మహిళా బ్యాంక్‌లో ఇప్పటి వరకు జరిగిన విచారణలో సుమారు రూ.3.50 కోట్లు అవినీతి బయట పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పాలక వర్గం రూ.2 కోట్లు, పాత వారు రూ.1.50 కోట్లు అవినీతికి పాల్పడినట్లు సమాచారం. మహిళలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ విమర్శలకు దిగుతున్నారు. నువ్వంటే, నువ్వంటూ గొడవలకు దిగుతున్నారు. ప్రస్తుతం ఉన్న పాలకవర్గ సభ్యులు, పాత సభ్యులు అందరూ రాజకీయపార్టీల నేతలకు చెందిన భార్యలు కావడం విశేషం. వైసిపి, టిడిపికి చెందిన నేతల భార్యలున్నారని తెలుస్తోంది. కేసు మరింత దర్యాప్తు చేసి, భారీ కుంభకోణం బయటపడితే రికవరీతోపాటు , జైలుకు వెళ్లాల్సివస్తుంది. తమ భార్యలను ఈ అవినీతి నుంచి బయటపడేయడానికి అందరూ సిఫార్సులు చేయించుకున్నట్లు తెలుస్తోంది. మా భార్యలను బయట పడేయండి సార్ అంటూ రాజకీయనేతలు, ఎంఎల్ఎల చుట్టు తిరుగుతున్నారని తెలుస్తోంది. అధికారులపైనా ఒత్తిడి పెరుగుతుండడంతో కేసు ఏం చేశారు, పేద మహిళలకు న్యాయం జరుగుతుందా అనే అనుమనాలు కలుగుతున్నాయి. రికవరీ చేసుకొని, విచారణ ముగించాలని కొందరు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాంక్ కుంభకోణంలో అవినీతి బయటకు వస్తుండడంతో తప్పుచేసిన మహిళల్లో బయం మొదలైంది. కొందరు ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. ఈ అవినీతి ఇంతటితో అగుతుందా.? విచారణ అధికారులు నివేదిక సక్రమంగా అందుతుందా? అసలు ఏం జరుగుతుందో అనే అనుమానం మండల ప్రజల్లో కలుగుతుంది. రాజకీయ నాయకులకు ఏదైనా సాధ్యమే. ఇంత పెద్ద అవినీతి జరుగుతుంటే అందరూ నేతలకు తెలిసినా మౌనంగా ఉండి పోయారు. ఇప్పుడు బయటకు రావడంతో తమ వాళ్లను రక్షించుకోడానికి అడ్డదారులు వెతుకున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.



ఇందుకూరుపేట మహిళా బ్యాంక్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు

స్నేహితుడిని హత్య చేసిన కేసులో నిందితుడు పచ్చా సురేష్‌ను వేదాయపాళెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు గురువారం విలేకర్ల సమావేశంలో నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 22వ తేదీన తన భర్త రావుల అనుదీప్‌ను పొదలకూరుకు చెందిన పచ్చ సురేష్ బైకుపై తల్పగిరి కాలనీకి తీసుకెళ్ళి కత్తితో గొంతు కోసి పారిపోయినట్లు మృతుని భార్యపావని వేదాయపాళెం పిఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు చేసేందుకు ఎస్‌పి సిహెచ్ విజయరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారన్నారు. మనుబోలు మండలం వడ్లపూడి గ్రామంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి నుంచి హత్యకు వినియోగించిన బైకు, మొబైల్‌ను స్వాదీనం చేసుకున్నామన్నారు. తనపై భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో హత్య చేసినట్లు నిందితుడు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు విచారణలో ప్రతిభను కనపరిచిన ఎస్ఐ రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్స్ జి.సుబ్బారావు, సురేష్, కానిస్టేబుల్స్ ఎ.మస్తాన్, నాగరాజులను డిఎస్‌పి అభినందించారు.

'గాలాజు'కు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు

సిఐటియు నిబంధనలకు అనుగుణంగా కట్టుబడి పనిచేయడమే కాకుండా తోటి కార్మికులకు ఆదర్శవంతంగా నిలిచిన వ్యక్తి గాలాజు లక్ష్మినరసింహాచారి అని సిఐటియు జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం అయ్యప్పగుడి ఆటో స్టాండ్ సమీపంలో ఆటో యూనియన్ నాయకులు జి.లక్ష్మినరసింహాచారి సంతాప సభ నిర్వహించారు. ముందుగా లక్ష్మి నరసింహాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నరసింహ చారి చిన్న వయసులో నే మరణించడం బాధకరమన్నారు.



మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వర్లు

మృతుని కుటుంబానికి, బంధువులకు వారి ప్రగాడ సంతాపం తెలిపారు .అయ్యప్పగుడి ఆటోస్టాండ్ వద్ద క్రమశిక్షణా చర్యలు అమలు చేయుటం కోసం, సిఐటియు నిబంధనలకు అనుగుణంగా కట్టుబడి తుది వరకు కషి చేశారన్నారు. చట్ట సభల్లో తమ సమస్యల వాణి వినిపించాలన్నా మన ప్రతినిధులు చట్ట సభలలో ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో 13న జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులైన మీగడ వెంకటేశ్వరరెడ్డి, పొక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలిపించాలని కోరారు. జిల్లా ఆటో కార్మిక సంఘం(సిఐటియు) వ్యవస్థాపక కార్యదర్శి దేవతాటి.సంపత్ కుమార్ ,యూనియన్ జిల్లా కార్యదర్శి కె.సురేష్ ,యూనియన్ రూరల్ కార్యదర్శి ఎం..సుధాకర్ ,సిపిఎం శాఖ కార్యదర్శి ఎస్‌కె.కాలేషా ,స్థానిక కమిటీ కార్యదర్శి శంకర్,ఒంగోలు.సుధీర్ ,రిక్ష యూనియన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకషి మానసిక వికలాంగుల పాఠశాలలో లింగసముద్రం గ్రామానికి చెందిన పూడిమెట్ల కోటయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా కుమారులు గోపి, శ్రావణ్, ప్రశాంత్ ,చిన్నరాయుడు వారి కుమార్తె చైతన్య అల్లుడు లక్ష్మీనరసింహం పాఠశాలకు ఆర్థిక సాయం, వస్తు సాయాన్ని అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాలకు 125 కేజీల బియ్యంతో పాటు రూ. 10 వేల నగదును విరాళంగా అందజేశారు. మానసిక వికలాంగుల పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. స్కూల్ కరస్పాండెంట్ ఎస్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాలికలు భారం కాదు..

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు అర్బన్ పరిధిలోగల కెజిబివి బాలికల స్కూల్, కళాశాలలో భేటీ బచావో భేటీ పఢావో కార్యక్రమం గరువారం జరిగింది. కందుకూరు ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం ప్రియంవద పిల్లల రక్షణ, భ్రూణ హత్యల నివారణపై మాట్లాడారు. కూతురు అంటే భారం కాదని, పదిమంది కొడుకులతో సమానమని తెలిపారు. భ్రూణ హత్యలు లేని సమాజాన్ని నిర్మించాలన్నారు.కందుకూరు బాలుర ఉన్నత పాటశాల ప్రధానోపాధ్యాయులు డి. అనురాధ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకొని భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని సూచించారు. అర్బన్ వైద్యాధికారి డాక్టర్ భ్యూలా గ్రేస్‌మాట్లాడారు. కెజిబివి స్పెషల్ ఆఫీసర్ స్వాతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ, హెచ్ఇఒ షేక్. ఆరీఫుల్లా, హెల్త్ సూపర్ వైజర్లు యం. శ్రీనివాస రావు, కె.పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.



తపాలా కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి- గుడ్లూరు :గుడ్లూరు పోస్టల్ కార్యాలయాన్ని పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారి శివాజీ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. నూతన ఖాతాదారుల్ని చేర్పించడంలో టార్గెట్ పూర్తి చేశారా లేదా అనే విషయంపై తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారి వెంకటేశ్వర్లు ,ఇన్‌ఛార్జి పోస్టుమాస్టర్ హరి ప్రసాదు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు బనాయించడం సరికాదు : టిడిపి

ప్రజాశక్తి-నెల్లూరు

ఎటువంటి ఆధారాలు లేకుండా మత్స్యకారులపై తప్పుడు కేసులు బనాయిస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులందరూ ఏకమై మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి, తమపై అక్రమ కేసులు బనాయిస్తున్న ప్రతి అధికారికి తగిన గుణపాఠం చెబుతామని మాజీ ఆఫ్ కాఫ్ చైర్మన్ కొండూరు పాల్ శెట్టి హెచ్చరించారు. గురువారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తోటపల్లి గూడూరు మండలం కొత్త కోడూరు పరిధిలోని గ్రామాల మత్స్యకారులపై మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అండదండలతో ఫారెస్ట్ అధికారులు అడిషనల్ డిఎఫ్ఒ మంగమ్మ, ఫారెస్ట్ రేంజర్ మారుతి ప్రసాద్ ,పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫారెస్ట్ భూమిలో మత్స్య సంపద సాగు చేసుకుంటున్నారని నెపంతో రొయ్యల చెరువులను ధ్వంసం చేశారన్నారు. ఈ కారణంగా మత్స్యకారులకు ఒకటిన్నర కోట్ల రూపాయలు నష్టం చేకూరిందన్నారు. కేసును ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులందరూ ఏకమై ఆందోళన చెపడతామని హెచ్చరించారు. మాజీ ఆఫ్ కాఫ్ చైర్మన్ కొండూరు పాల్ శెట్టి , ఆవల మునిరత్నం, బొమ్మన పలని, ముక్కంటి బాబురావు, అక్కయ్య గారి ఏడుకొండలు, పామంజి శ్రీరాములు, పామంజి దొరబాబు ఉన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి..!



నెల్లూరులో...

ప్రజాశక్తి-నెల్లూరు : పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఎం.వెంకటేశ్వర్లరెడ్డి, పి.బాబురెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాలు ప్రచారం వేగవంతం చేశాయి. గురువారం నగరంలోన పలు కళాశాలలు, పాఠశాలల్లో పర్యటించి పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. 26వ డివిజన్ ప్రాంతంలోని జ్యోతినగర్ ప్రాంతంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు దేవతాటి సంపత్ కుమార్, శాఖ కార్యదర్శి ఎస్‌కె కాలేషా, పులిమి నరసింహారెడ్డి , అల్తాఫ్ , బి వెంకటేశ్వర్లు.తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు చిత్తూరు ప్రకాశం జిల్లాల ఎంఎల్‌సి గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న ఎం. వెంకటేశ్వర్ రెడ్డి టీచర్స్ అభ్యర్థిగా బాబు రెడ్డిల కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిందిగా 31వ డివిజన్ వసుదానగర్లో ప్రజా సంఘాలు ఇంటింటికి తిరిగి కరపత్రం పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకు లు సుందర్ రాజన్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కందుకూరు :పట్టణంలోని సాయి నగర్, నాంచారమ్మ కాలనీ, బొడపాటి వారి కొస్తాలు, ముప్ప రాజు వారి కోస్తాలు, కొండి కందుకూరు, ఎర్ర వడ్డీ పాలెం, మడమర వడ్డీ పాలెంలలో పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ ఎంయల్‌సి అభ్యర్థి పి బాబు రెడ్డిని గెలిపించాలని, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో, ఇంటి, ఇంటి ప్రచారం గురువారం నిర్వచించారు. ప్రజా సంఘాల నాయకులు పిజె విలియం, ఎం రమేశ్, జివి శేషారావు, జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు: ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు కార్యదర్శి మారుబోయిన రాజా కోరారు. గురువారం మండలంలోని నరుకూరు గ్రామంలో ఆటో యూనియన్ వర్కర్స్, సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. రాజా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రభుత్వ భవనాలు సాధించాలంటే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయాలు జోక్యం అయ్యాయన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు పోరాటాల ద్వారా ఎన్నో సాధించారని రాజా తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి నాణ్యమైన విద్య, ప్రభుత్వ భవనాలను సాధించే అవకాశం కలిగించాలని రాజా కోరారు. ఆటో యూనియన్ వర్కర్స్ మరియు సిపిఎం పార్టీ శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో..



తోటపల్లి గూడూరులో..

ఎంఎల్‌సి అభ్యర్థి విజయం కోరుతూ ప్రచారం

ఉలవపాడు :నిరుద్యోగ భతి ఇస్తానని ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ప్రశ్నించారు. మండలంలోని ఆత్మకూరులో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈనెల 13వ తేదీన జరిగే తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయం కోరుతూ నాగేశ్వరరావు మాట్లాడారు. క్లస్టర్ ఇన్‌ఛార్జులు బెల్లం కష్ణమోహన్, పోలుబోయిన శ్రీనివాసులు, సుదర్శి శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌ఛార్జి రాయపాటి మహేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కన్నా ప్రసాద్, మిరియం మల్లికార్జున, ఆత్మకూరు సర్పంచ్ నాళం గోవిందమ్మ, మాజీ సర్పంచ్ అమరనేని రాములు, దామచర్ల సుబ్బారావు, దేవినేని హనుమంతరావు, మద్దసాని మహేంద్ర, కొల్లి అవినాష్, నాళం నారాయణ రావు, సుబ్బా నాయుడు, తల్లపనేని కొండలరావు పాల్గొన్నారు.

రాపూరు :పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ను గెలిపించాలని కోరుతూ రాపూరు మండలంలోని క్లస్టర్ 3లోని 8 పంచాయతీల్లో టిడిపి వెంకటగిరి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు శిస్లా లోహిత్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్ రెడ్డి, క్లస్టర్3 ఇంచార్జ్ కొండ్లపూడి రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

అవస్థల్లో పోస్టల్ వినియోగదారులు

ప్రజాశక్తి -గుడ్లూరు :గుడ్లూరు సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఏజెంట్ లేకపోవడంతో వందలాదిమంది వినియోగదారులు గత రెండేళ్ల నుంచి అవస్థలు పడుతన్నారు. ఎన్‌ఆర్‌జిఈఎస్ పథకం ద్వారా వచ్చే కూలీ డబ్బులు రైతు భరోసా పిఎం కిసాన్ తదితర ప్రభుత్వ పథకాలు ద్వారా పొందే పైకం తీసుకోవడానికి ఏజెంట్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సుమారు 700 మంది కూలీలు ఇతర పోస్టల్ వినియోగదారులు స్థానిక పోస్టల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పోస్టల్ కార్యాలయంలో సులభంగా నగదు పొందవచ్చని నమ్మ బలికిన పోస్టల్ అధికారులు ఒక్కో వినియోగదారుని దగ్గర నుంచి రూ. 100 తీసుకుని ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంకు పేరుతో సుమారు 1400 మందికి నూతన ఖాతాలు తెరిచారు. అయితే ఏజెంటు లేనందున మండలంలో ఉన్న పూరేటిపల్లి పొట్లూరు కొత్తపేట గ్రామాల్లో ఉన్న బ్రాంచి పోస్ట్ ఆఫీస్‌లలో ప్రభుత్వ పథకాలు కూలీ డబ్బులు తీసుకోవాలని గుడ్లూరు పోస్ట్ ఆఫీస్ అధికారులు చెబుతున్నారు. ప్రతిసారి ఆయా గ్రామాలకు వెళ్లి రావడానికి రూ. 40 చార్జీలు ఖర్చు చేయాల్సి వస్తోంది. మరికొన్ని గ్రామాలకు కాలినడకన వెళ్లాల్సివస్తోంది. ఎపిఎం, ఏజెంట్‌ను నియమించాలని వినియోగదారులు జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సబ్సిడీపై దాణామృతం పంపిణీ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :పశుపోషకులకు సంపూర్ణ దాణామృతం సబ్సిడీపై కేజీ రూ.6.50లకే అందజేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ కందుకూరు డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్ చంద్రశేఖరరావు తెలిపారు. మండలంలోని పోకూరు పశువైద్యశాలను గురువారం ఆయన సందర్శించారు. కార్యాలయ రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశుగ్రాస విత్తనాలు అందజేస్తున్నట్లు వివరించారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల వేసే కార్యక్రమం ఈ నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ముద్దచర్మ వ్యాధికి 9వేలకు పైగా టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. రైతుభరోసా కేంద్రం యూనిట్‌గా పోషకులకు అవసరమైన సబ్సిడీలు అందజేస్తున్నట్లు చెప్పారు. పశువైద్యశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -పొదలకూరు : త్వరలో జరిగే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాలుర , బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వరంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ ప్రేరణ తరగతులకు ప్రముఖ మోటివేటర్ కోదండరామ్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలుర , బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుని , ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నత్త నడకన నిర్మాణ పనులు

ప్రజాశక్తి-సైదాపురం :మండలంలో గ్రామ సచివాలయాల నిర్మాణపనులు నత్త నడకన సాగుతున్నాయి. ప్రభుత్వం మండలంలోని 31గ్రామ పంచాయతీలకు19 సచివలయాలను మంజూరు చేసింది.అందులో ఇప్పటి వరకు లింగసముద్రం పంచాయతీ సచివాలయం పూర్తయి ప్రారంభానికి నోచుకోలేదు. మిగతా భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. మర్లపూడి పంచాయతీలో రాజకీయాలతో అసలు పనులు ప్రారంభానికే నోచుకోలేదు. సైదాపురం సచివాలయం2 పునాదులు దాటని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో శ్రద్ధ చూపక పోవడం వల్లే పనులు ఆగాయని గుత్తేదార్లు అంటున్నారు. అధికారులు శ్రద్ధ వహించి భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆప్రాంతవాసులు కోరుతున్నారు.



గ్రావెల్ అక్రమ తరలింపు

ప్రజాశక్తి -వెంకటాచలం : మండలంలో వైసిపి నాయకులు ఇష్టానుసారంగా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని టిడిపి మండల అధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ ఆరోపించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంత్రి కాకాణి అండదండలతోనే ఆయన అనుచరులు ఈ గ్రావెల్ దందాని కొనసాగిస్తున్నారని విమర్శించారు. గ్రావెల్ తరలిస్తున్న వాహనాల జిపిఎస్ ఫొటోలు సైతం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. అధికారుల సైతం మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఎస్ రమణయ్య, రమేష్, రాజేంద్ర, మందల మణి, దాసి చక్రధర్, నాగరాజు, వెంకట్రాది పాల్గొన్నారు.

నూరు శాతం పన్ను వసూలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని గ్రామ పంచాయతి కార్యదర్శులకు కందుకూరు డివిజనల్ పంచాయతి అధికారి కృష్ణమోహన్ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలు నందు గురువారం పంచాయతి కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వేసవిలో మంచినీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతి విధుల పట్ల కార్యదర్శులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎంపిడిఒ షేక్ రఫీక్అహ్మద్, ఇఒఆర్‌డి మాధవి, కార్యదర్శులు పాల్గొన్నారు.



సస్పెన్షన్ కొనసాగిస్తూ ఉత్తర్వులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండల కేంద్రం రహమతాబాద్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఖాజా నాయబ్ రసూల్ దర్గా మాజీ ముతవల్లి హాఫీజ్ పాషా పై సస్పెన్షన్ కొనసాగిస్తూ ఉత్తర్వులు పొడిగించడం జరిగిందని దర్గా ఇఒ హుస్సేన్ తెలిపారు. గురువారం ఆయన దర్గాలోని వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముతవల్లి హఫీజ్ బాషా ను కొన్ని ఆరోపణల నేపథ్యంలో 10 రోజులపాటు సస్పెన్షన్ విధించారన్నారు. ఆ సస్పెన్షన్ కొనసాగిస్తూ స్టేట్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ వి.ఖాదర్ బాషా ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. విచారణ అధికారిగా ఏ.కె. నజీర్ అడిషనల్ డైరెక్టర్ సిరి కల్చర్ డిపార్ట్మెంట్ వారిని నియమించారన్నారు. ప్రస్తుతం దర్గాలో అన్ని కార్యక్రమాలు తమ ఆధ్వర్యంలోని జరుగుతున్నట్లు తెలిపారు. తాము బాధ్యతలు తీసుకున్నప్పుడు దర్గా అకౌంట్లో 6 లక్షల 88,000 నగదు అన్నదానం అకౌంట్లో 43 వేల రూపాయలు ఉన్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో పారదర్శకత, మిస్ యూస్ ఆఫ్ ఫండ్స్, లైంగిక వేధింపులు తదితర ఆరోపణలపై ఆయనను తొలగించామన్నారు. సెక్షన్ 24 ప్రకారం 6నెలలపాటు విచారణ జరగనున్నట్లు తెలిపారు. దర్గాకు వచ్చే భక్తులు ఎలాంటి అపోహాలు వదంతులు నమ్మకుండా నిర్భయంగా దర్గాకు వచ్చి దర్శనాలు చేసుకోవచ్చని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ వైస్ చైర్మన్ షేక్ షౌకత్ అలీ, సెక్రటరీ షేక్ సంధాని బాషా, జిల్లా సభ్యులు సయ్యద్ షాజహాన్, జిల్లా ఇన్‌స్పెక్టర్ షేక్ అహ్మద్ బాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దర్గా ఇఒ హుస్సేన్

ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: అన్ని గ్రామాలలో కొత్త తరహా జీవనోపాదులు ఎన్నుకొని వాటి ద్వారా ఆర్థికంగా ఎదుగుదల కావాలని పీడీ సాంబశివారెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని త్రికోటేశ్వర కళ్యాణమండపంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పలు మండలాల పొదుపు అధికారులు సిబ్బంది, విఒఎలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పొదుపు ఏసీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీడీ సాంబశివరెడ్డి మాట్లాడుతూ జిల్లాకు పొదుపు చేయడంతో రుణాలు తీసుకుని వివిధ రకాల కుటీర పరిశ్రమలు నెలకొల్పి రాష్ట్రానికి అదర్శంగా నిలిచారన్నారు. గ్రామాలలో గ్రూప్ మీటింగులు సక్రమంగా నిర్వహించాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో బ్యాంకులకు చెల్లించే విధంగా కషి చేయాలని సూచించారు. గ్రామాలలో కొత్త తరహా జీవనోపాదులు ఎన్నుకొని వీటి ద్వారా ఆర్థికంగా ఎదుగుదల కావాలని సూచించారు . పొదుపు నగదు డిపాజిట్లకు బ్యాంకర్లకు కేవలం మూడు శాతం మాత్రమే వడ్డీ ఇస్తూ రుణాలపై 12 శాతం వడ్డీ తీసుకుంటున్న విషయంలో సభ్యులు గుర్తించాలన్నారు. అలాంటి పరిస్థితుల్లో వారు తీసుకునే రుణాలు సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో పొదుపు డిపాజిట్లు వివిధ బ్యాంకుల్లోరూ.450 కోట్ల ఉండగా మహిళలు తీసుకున్న పొదుపు రుణాలు రూ.1050 కోట్లు ఉన్నాయన్నారు గ్రామాలలో పొదుపు రుణాలు తీసుకునే సబ్బులుచే కుటీర పరిశ్రమ పాడి పరిశ్రమలైన పిండి మరలు, వస్త్రాల వ్యాపారంతో పాటు పాడి పరిశ్రమ అభివద్ధి చెందేలా దానికి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ డి రాజు , ఏపిఎంలు పి.వెంకమ్మ , రోజ్ మేరి , రమణారావు , సుజీవన వివో ఏలు తదితరులు పాల్గొన్నారు,


మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి

నుడా హౌసింగ్ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: రూరల్ మండలంలో మంజూరైన నుడా హౌసింగ్ పనులు వెంటేనే చేపట్టాలని ఎంపిడిఒ సి. శ్రీనివాసులు తెలియజేశారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 599 గహాలు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో 462 లబ్ధిదారులు ఆన్ లైన్‌లో నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇంకను 137 వివరాలు నమోదు చేయాలని తెలియ జేశారు. 102 గహాలకు ఎం.బుక్ ద్వారా బిల్లులు పూర్తి చేయబడ్డాయన్నారు. మిగతా వారికి బిల్లులు తయారుచేసి త్వరగా పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న హౌసింగ్ ఇంజినీరు మాట్లాడుతూ కలెక్టర్ హౌసింగ్ పై ప్రత్యేక శ్రద్ధ చూపించడంతో అందరూ ఇంజినీర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సమావేశంలో అందరూ సచివాలయం ఇంజినీరు సహాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసులు

ఘనంగా డిసిఎంఎస్ ఛైర్మన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కొడవలూరు : డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు జన్మదిన వేడుక నార్తురాజుపాలెం వీసీఆర్ లేఅవుట్లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వేడుకకు హాజరై పుష్ప గుచ్ఛం ఇచ్చి చలపతిరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివద్ధికి చలపతిరావు చేస్తున్న కషి ఎనలేనిదని కొనియాడారు. నియోజకవర్గంలోని పలువురు అధికారులు, నాయకులు చలపతిరావును కలసి పూల మాలలు, పుష్ప గుచ్ఛాలిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే చలపతిరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు, అధికారులు బారులు తీరారు.

డిప్యూటీ డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి-బిట్రగుంట: కావలి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.బ్రిజిత గురువారం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి, తిప్ప గురుకుల పాఠశాలకు వెళ్లి పిల్లలకు అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిసిపి అండి యాక్ట్ బేటి బచావో, బేటి పడావో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే గురించి పిల్లలకు ఒక అవేర్నెస్ క్రియేట్ చేశామన్నారు. ప్రభుత్వ స్కీం సుకన్య సమద్ధి యోజన పథకం గురించి పిల్లలకు తెలియజేశారు. దాన్ని ఉపయోగించుకునేలా ఎంకరేజ్ చేశామన్నారు. ఆడపిల్లలకు స్పర్శ అంటే గుడ్, బ్యాడ్ టచ్ దాని పైన అవేర్నెస్ కలిగించామని పేర్కొన్నారు.

పలుచోట్ల ఎంఎల్‌సి అభ్యర్థుల ప్రచారం

సీతారామపురం: తూర్పు రాయలసీమ పట్ట భద్రుల ఎంఎల్‌సి టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపునకు ప్రచారం నిర్వహించారు. గురువారం మండలంలోని బసినేని పల్లి పంచాయతీలో ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళివెల జ్యోతి, కల్లూరి వెంకటేశ్వర్లు రెడ్డి, వెంకటేశ్వర్లు, జాషువా,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: తూర్పు రాయలసీమ పట్టు భద్రుల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి గెలుపునకు ప్రచారం నిర్వహించారు. మండలంలోని రామనాయుడు పల్లి , చిన్న మాచనూరు గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిద్ధంరెడ్డి మోహన్ రెడ్డి గంగవరపు శ్రీనివాసులు నాయుడు , అమర్నాథ్ రెడ్డి , మౌలాలి, గువ్వల వెంగళ రెడ్డి పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: తూర్పు రాయలసీమ పట్టభద్రులు టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపునకు ప్రచారం చేశారు. గంగపట్నం గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కొండూరు సుధాకర్ రెడ్డి, గంపల అనిల్, కష్ణారెడ్డి ,వెంకటకష్ణారెడ్డి, బోద్దుకూరు సుధాకర్, సుధీర్,కార్యకర్తలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: తూర్పు రాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసీపీకి పట్టభద్రులు గుణపాఠం చెప్పాలని టిడిపి మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్ రావు అన్నారు. తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపునకు ప్రచారం నిర్వహించారు. మండలంలోని రామపురం, కాకొల్లువారిపల్లి, తదితర గ్రామాలలో మండల నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చంద్రా వెంకయ్య, పోకా మహేష్, తాతపూడి లాభాన్, ఆరికొండ వెంకటరత్నం, వేమూరి భాగ్యలక్ష్మి ,మాలకొండ రాయుడు, రావెళ్ల గోపికష్ణ, గోపీచంద్, మురళీ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానానికి కంచర్ల శ్రీకాంత్ గెలుపునకు ప్రచారం చేశారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించి బస్టాండ్ సెంటర్ లో దుకాణా యాజమాన్య పట్టభద్రులకు కరపత్రాలను అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చింతన బోయన బయన్న, షేక్ రియాజ్, బొజ్జ నరసింహ, నల్లిపోగు నరసింహులు, రమణారెడ్డి, శివకుమార్, అంబటి మస్తాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

ప్రజాశక్తి-కావలి

కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను సిలిండర్‌కు 50 రూపాయలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని సిపిఎం కావలి పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు కరెంటు, బస్‌ఛార్జీలు, ట్రైన్, డీజిల్,పెట్రోల్, ధరలు పెరిగి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే బిజెపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత రేట్లు పెంచుకుంటూ పోతుందన్నారు.కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల ధరలు హద్దు అదుపు లేకుండా పెంచి అన్ని రంగాల ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందని విమర్శించారు. ఇప్పటికైనా పెంచిన ధరలు తగ్గించాలని లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



వరికుంటపాడు

గ్యాస్ ధర పెరగడంతో మధ్యతరగతి ప్రజలు విలవిలాడిపోతున్నారని రాష్ట్ర పిసిసి కమిటీ సభ్యుడు దుద్దుకూరు రమేష్ నాయుడు తెలిపారు. ఆయిల్ కంపెనీల సిండికేట్ గా కుమ్మక్కై ప్రజలపై ఎనలేని భారాన్ని మోపుతున్నాయన్నారు. ధరల విషయంలో ఇదేవిధంగా ప్రవర్తిస్తే ప్రభుత్వంపై ప్రజల నుండి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చే విధంగా ఆందోళన చేపడతామన్నారు. అందుకోసం రాబోయే రోజుల్లో ప్రతి మండల కార్యాలయాల దగ్గర ప్రజలతో కలిసి పెరిగిన ధరల విషయంలో నిరసనలు చేపడతామన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు.

జలదంకి: కేంద్రం బిజెపి ప్రభుత్వం గ్యాస్ బండ ధర 50 రూపాయలు పెంచి పేదలపై పెనుభారం మోపారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. మాల్యాద్రి రైతు సంఘం జలదంకి మండల కార్యదర్శి గడ్డం మాల్యాద్రి' మహిళా సంఘం నాయకురాళ్లు గడ్డం విజయలక్ష్మి' మారుబోయిన కొండమ్మ' పులుసు కోటేశ్వరమ్మ ఒక సంయుక్త ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం చర్యను తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు గ్యాస్ పెంపుదల మరింత ఆజ్యం పోసిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరను తగ్గించకపోతే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన బిజెపి ప్రభుత్వం ఎదురుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు అడపాల సురేష్, 'వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు బత్తల నరసింహ' తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరుఅర్బన్

ప్రజలకు గ్యాస్ సిలిండర్ ధర గుదిబండగా మారిందని ఆత్మకూరు ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం తీవ్రంగా ఖండించారు.. ఇప్పటికే ప్రజలు నిత్యావసర ధరలు, నూనె ధరలు, పప్పు దినుసులు ధరలు , పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలతో పేద ప్రజలు గగ్గోలు పెడుతుంటే కేంద్ర ప్రభుత్వం మళ్లీ గ్యాస్ ధర రూ.50 పెంచడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ప్రచారం


మర్రిపాడులో ప్రచారం చేస్తున్న దృశ్యం


ఆత్మకూరులో ప్రచారం చేస్తున్న దృశ్యం


ఉదయగిరిలో పచారం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మర్రిపాడు

పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి బాబు రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శిమూలి వెంగయ్య మాట్లాడుతూ శాసన మండలిలో నిరుద్యోగ, చిరుద్యోగ సమస్యల పరిష్కారం , అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు వెట్టి చాకిరి విధానం రద్దు కోసం, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగు ల సమస్యల పరిస్కారం కోసం, సీపీఎస్ రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరణ చేయాలని,ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గ ఉద్యమాలకు అండగా నిలుస్తున్నది పిడిఎఫ్ తరుపున గెలిచిన వారేననిపేర్కొన్నారు .ఓటు కలిగిన పట్ట భద్రులు ప్రతి ఒక్కరూ పిడిఎఫ్ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ మండల ఉపాధ్యక్షులు రహంతుల్లా, కార్యదర్శి గౌస్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కావలిలో ప్రచారం చేస్తున్న దృశ్యం

కావలి

పట్టణంలోని వైకుంఠపురం రామాలయం వీధి, ముస్లిం కాలనీ, పెంకుల్ ఫ్యాక్టరీ రోడ్డు తదితర ప్రాంతాలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని గురువారం డివైఎఫ్ఐ సిఐటియు ఆధ్వర్యంలో ఏమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్దల సభలో ప్రజలు, ఉద్యోగుల ,నిరుద్యోగుల తరపున ప్రశ్నించే అభ్యర్థిపిడిఎఫ్ తరపున పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర రెడ్డికి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబు రెడ్డికి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, బోగిశెట్టి కృష్ణయ్య, జి.మధుసూదన్ రావు, వి సుబ్రహ్మణ్యం, సిఐటియు నాయకులు వై కష్ణమోహన్, డివైఎఫ్ఐ నాయకులు పసుపులేటి పెంచల నరసింహం, గోచిపాతల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు అర్బన్

మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి (బీసీ కాలనీలో) తూర్పు రాయలసీమ (చిత్తూరు ,ప్రకాశం, నెల్లూరు) శాసనమండలి ఎన్నికలలో పిడిఎఫ్ తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీగా అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వర రెడ్డి , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబు రెడ్డి లకు మద్దతుగా ఆత్మకూరు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తులను గెలిపించాలని ఈ సందర్భంగా ఓటర్లను అభ్యర్థించారు. డబ్బుకు లొంగకుండా పెద్దల సభకు వెళ్లే పోరాట పటిమగలిగిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో షేక్ సంధాని, కష్ణమోహన్, వాగాల శ్రీహరి, మోహన్‌రెడ్డి, స్థానికుడు కోటకొండ హరి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి

ఉపాధ్యాయ, గ్రాడ్యుట్ సమస్యల పరిష్కారాల కోసం పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజా సంఘం నాయకులు కోరారు. గురువారం స్థానిక పలు ప్రభుత్వ కార్యాలయాలు దేవలాల్ గడ్డ సినిమా హాల్ వీధిలో ప్రచారాన్ని ముమ్మరంగ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పిడిఎఫ్ ఎంఎల్‌సి పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను మొదటి ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు కాకు వెంకటయ్య, గడ్డం నాగేశ్వరరావు, పర్ధిన్ బాషా,నాయబ్ పాల్గొన్నారు

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు..!

..వైసీపీ నేతకు 6ఎకరాల భూమి
..నిద్రావస్థలో అధికారులు

ప్రజాశక్తి-అల్లూరు

యథేచ్ఛగా గ్రావెల్‌ను కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇందులో ఓ వైసిపి నాయకుడు ఆరెకరాలు స్వాధీనం చేసుకున్నాడు. మండలంలోని నార్త్ ఆములూరు గ్రామం ఇది కొంతమందికి తెలిసిన సాధారణ పంచాయతీ. కొడవలూరు మండలం, అల్లూరు మండలాలకు సంబంధించిన ఒక రెవెన్యూ బార్డర్. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కోట్ల రూపాయల విలువచేసే సంపదను ఇక్కడ నుండే దర్జాగా తరలిస్తూ ఉంటారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్ల తెరచి ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ పుటేజీలను పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. అధికారులంతా ఇందులో భాగస్వాములేనని అంటున్నారు. రాష్ట్రంలో బళ్లారికి మించిన మైనింగ్ సంపద ఈ గ్రామంలో ఉంది. ఈ గ్రామం అంటే అధికారంలో ఉన్న ఏ నేతలకైనా ఎనలేని ప్రాణం. కళ్లముందే గ్రావెల్ దోచుకు వెళ్తూ ఉంటారు. విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది, అధికారుల కళ్ల ముందే దోపిడీ జరుగుతున్నా వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు జరుగుతున్న తతంగం పై ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఒక అధికారి కీలక పాత్ర పోషించి అధికారుల సైతం పక్కదో వపట్టిస్తాడు. ఈ మండలంలో దాదాపు 350 ఎకరాలు ప్రభుత్వ భూములు, మైనింగ్ సంబంధించిన సంపదలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో అంతా కొల్లగొడుతూ ఉండడంతో రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని అనేకమంది బహిరంగ విమర్శిస్తున్నారు. ఆనాటి కావలి మాజీ శాసనసభ్యులు ప్రస్తుత రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు పేద ప్రజలను ఉద్ధరిస్తారనే నెపంతో ప్రభుత్వ భూముల్లో ముమ్మరంగా సర్వే చేయడం జరిగింది.


ఆక్రమణలో ప్రభుత్వ స్థలం

తెలుగుదేశం పార్టీని అడ్డం పెట్టుకుని మైనింగ్ మాఫియాకు పాల్పడ్డారని తెలుపుతున్నారు. ఆయన వేసిన బీజంతో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇక్కడ బళ్లారి మైనింగ్ ను తలపించే విధంగా దందా కొనసాగుతుందని కొందరు తెలియజేస్తున్నారు. అదే తరహాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుండి ముమ్మరంగా గ్రావెల్ దోపిడీకి పాల్పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని సూటిగా ప్రశ్నిస్తున్నారు. వేల కోట్ల రూపాయలు అధికార పార్టీ నేతలు సంపాదించుకున్న తరుణంలో రెవెన్యూ అధికారులకు సమభాగం వాటా వెళుతుందని అనేకమంది విమర్శిస్తున్నారు. గత మూడున్నర సంవత్సరాల నుంచి గ్రావెల్ అక్రమ పై రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నోరు మెదపకపోవడంపై అనేక అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు. వైసీపీ అధికారంలో విచ్చల విడిగా భూ దందాలు, గ్రావెల్ మాఫియా బహిరంగంగా జరిగిందని దీనిపై చిత్తశుద్ధి ఉంటే సిట్ ని నియమిం చాలని సవాల్ విసురుతున్నారు. ఇప్పటి వరకు కావలి ఎమ్మెల్యే భూభోగాతాలపై నోరు మెదపక పోవడంతో అనేకమంది ఘాటుగా విమర్శిస్తున్నారు.గ్రావెల్ సంపదను దోచుకోవడంలో అంతా హరిచంద్రులను అంటున్నారు.ఏపార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వ భూముల్లో పాగా వేసి అంతా దోచుకుంటున్నారని మండల ప్రజలు తెలియజేస్తున్నారు. గోగులపల్లికి చెందిన ఓ వైసీపీ నేత దళితుల స్థలాలను ఆక్రమించి సర్వం దోచుకున్నారని ఆ నేతకు నార్త్ ఆములూరు గ్రామంలో ఆరెకరాలు కట్టబెట్టడంపట్ల ఆగ్రహం వ్యక్త పరుస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కొమ్ము కాస్తూ ప్రభుత్వ భూములను దర్జాగా దోచుకుని సాగు చేస్తున్నాడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి కి చిత్తశుద్ధి ఉంటే అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరుతున్నారు. అధికార పార్టీ నేతలు భూములు ఆక్రమించి క్రయ,విక్రయాలకు పాల్పడుతుంటే రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవడం పట్ల మండలంలో వింత గొలుపుతుంది.ఏదేమైనా గ్రావెల్ అక్రమ తరలింపునకు చెక్ పెట్టాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి-జలదంకి : ఒక అవకాశం కల్పిస్తే ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివద్ధి చేసి చూపిస్తానని మూల వెంకట రమణారెడ్డి అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నో అభివద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. గతానికి భిన్నంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా మెట్ట ప్రాంత అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తానన్నారు. తనకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాటా మాల్యాద్రి రెడ్డి, 'గుండు రఘురామిరెడ్డి, 'సురే భాస్కర రెడ్డిలు ఉన్నారు.


ప్రచారం చేస్తున్న దృశ్యం

ఆలయంలో అంకురార్పణ.

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం, కొండ బిట్రగుంట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బిలకుట క్షేత్రంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. గురువారం గిరి ప్రదర్శన అంకురార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం శ్రీ వెంకటేశ్వర పాలెంలో వెలసి ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు సందర్భంగా ఆలయానికి వచ్చు భక్తులకు విజయవాడ ఉమెన్ డాక్టర్ గ్రూప్స్ వారి సహకా రంతో, సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం భక్తులకు ఉచిత మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ కార్యక్ర మాన్ని సనాతన పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బోద్దుకూ రి .నారాయ ణరావు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు వచ్చు భక్తులకు సేదతించేందుకు మజ్జిగను మంచి నీటిని నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో చెరుకూరి జనార్దన్ రావు, బంక శ్రీనివాసులు, కుందుర్తి వరప్రసాద్ ,కుందుర్తి సుశీల పాల్గొన్నారు.


బాధితునికి సాయం అందజేస్తున్న కాకర్ల సురేష్

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని వెంగళరావు నగర్ యాక్సిడెంట్‌లో రెండు కాళ్లు పోయి మంచాన ఉన్న షేక్ ఇబ్రహీంకు 10 వేల రూపాయల తక్షణ నగదు సహాయం అనంతరం పసి బిడ్డ తల్లి భర్త చనిపోయి ఇబ్బందులతో ఒంటరిగా జీవిస్తున్న కడిమపాటి హైమావతికి 10 వేల రూ తక్షణ ఆర్థిక సహాయాన్ని కాకార్ల ట్రస్టు అధినేత సురేష్ అందించారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరైనా ఆరోగ్య తదితర ఇబ్బందులు సమస్యలతో ఉన్నవారు తన దష్టికి రాగానే తక్షణ ఆర్థిక సహాయం అందజేసి వారికి అండగా నిలుస్తానన్నారు.కార్యక్రమంలో మహమ్మద్ ఖాజా, మాజీ సర్పంచ్, షేక్ ఖాజాపీర్, మాజీ ఉపసర్పంచ్, రావిళ్ళ నాగేశ్వరరావు, మన్నెం మధు రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం పాత హరిజనవాడకు చెందిన అంబటి కమలేశ్వర్‌రావు బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో గురువారం బలన్మరణానికి పాల్పడ్డాడు. సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళ్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కమలేశ్వర్‌రావు సికింద్రాబాద్ లోని లాలాగూడ ప్రాంతంలో గ్రేడ్ 1 టెక్నీషియన్‌గా రైల్వే శాఖలో పనిచేస్తున్నాడు. ఎంతో చురుగ్గా ఉండే కలిసిపోయే స్వభావం గల రైల్వేలో ఉద్యోగం సంపాదించు కున్నాడని మృతుని బంధువులు తెలిపారు. ఈ విషయంపై జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కావలి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-దగదర్తి: అల్లూరు పాత బస్టాండ్ దగ్గర నివాసం ఉంటున్నరమణయ్య రమేష్ (42) మండలంలోని ఉలవపాళ్ల లోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఐఒసి పెట్రోల్ బంక్ పక్కనే ఖాళీ స్థలంలో చెట్టుకి తన లుంగీ తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన కొందరు వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి కావలిరూరల్ సిఐ రాజేష్, దగదర్తి ఎస్ఐ సుమన్ అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా జేబులో అల్లూరు పాత బస్టాండ్ దగ్గర లక్ష్మీ టైలరింగ్ షాప్ కార్డు ఉంది. దానిపై ఫోన్ నెంబర్లు ఉండడంతో దాని ఆధారంగా ఫోన్ చేయడంతో అల్లూరు చెందిన వ్యక్తి అని సిఐ తెలిపారు. కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకొని ఉంటాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజలను మోసగించిన కేంద్రం

ప్రజాశక్తి-అనంతసాగరం: మోడీ తన మోసపూరిత వద్దనలో భాగంగా మరోమారు వంటగ్యాస్ ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేము హరిబాబు విమర్శిం చారు.కేంద్రప్రభుత్వం ప్రజలపై విచ్చల విడిగా దినసరి సరుకుల ధరలు పెంచిందన్నారు. రాష్ట్ర నాయకత్వం మేనమామ గా కాకమ్మకథలు చెబుతూ ప్రజలపై పెనుభరాన్ని మోపారన్నారు. ఎపి పన్నులతోనే రాష్ట్ర ప్రజలు పరిపాలిం చుకొంటున్నారనేది రాష్ట్రప్రజలు తెలుసు కోవాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి కపట ప్రేమతో కూడిన పన్నుల పెనుభారాన్ని మోపడం తో దేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ మస్తాన్, కిసాన్ సెల్ అధ్యక్షులు రామకష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు పి.ఓబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆగమ సలహా మండలి సభ్యులుగా మురళీ

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని చుంచులూరులోని ఇంద్రాక్షి అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకులు మురళీకష్ణమాచార్యులకు అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మకమైన ఎపి ఆగమ సలహా మండలి సభ్యులుగా నియమితులయ్యారు. గురువారం విజయవాడలోని ఎండోమెంట్ ఆఫీసులో ఎండోమెంట్ కమిషనర్ జవహర్ లాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు ఆగమ సలహా మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చుంచులూరు గ్రామానికి చెందిన జొన్నా సత్యానారాయణ, ఇరుకు మాటి మురళీధర్‌లు మాట్లాడుతూ వేదంలో మంచి ప్రావీణ్యం ఉన్న మురళీకృష్ణ మాచా ర్యులు ఆగమ శాస్త్ర సలహా మండలి సభ్యులుగా నియమితులు కావడం అభినందనీయమన్నారు.

నేడు ఉచిత శిక్షణ తరగతులు

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్: ఎపి నైపుణ్యాభివద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలో ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్ ఉచిత శిక్షణ ఎటువంటి ప్రవేశ రుసుం లేకుండా ఉచిత శిక్షణిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీ లక్ష్మీ తెలిపారు.శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు.శిక్షణ కాల పరిమితి మూడు నెలలు ఉంటుందన్నారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు రవాణా ఖర్చులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో చేరబోవు విద్యార్థులకు కనీస వయసు 18 సంవత్సరాలు గరిష్ట వయసు 35 సంవత్సరాల లోపు ఉండవలెనన్నారు. విద్య అర్హతలు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరిగా పాసై ఉండవలెనన్నారు. ఈ శిక్షణ తరగతులు మార్చి 3వ తేదీ నుండి ప్రారంభమవుతాయని తెలిపారు.